ఓం

శుభమస్తు అవిఘ్నమస్తు

# ముగురమ్మల మూలపుటమ్మ



రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech



## ముందుమాట

గాయత్రీమాతను పూజించని ధార్మికుడుండడు. ఈమె జ్ఞాన దేవత. నేడు మార్కెట్‌లో దొరుకుతున్న ‘టెక్నాలజీ’ వల్ల ఆ మంత్రం తెలియని ‘సివిలైజ్డ్’ ఉండడనటంలో అతిశయోక్తిలేదు. బీజాక్షరాలే ప్రింటులో దొరుకుతున్న ఈ రోజుల్లో వీలయితే బ్రహ్మాస్త్రం మంత్రం కూడా ప్రింట్‌చేసి మాకు రానివిద్య లేదని చాటి చెప్పేవారు.

ఈరోజున శిఖరాగ్ర దేశాలు తాము అణుబాంబుమీద గుత్తాధిపత్యం చెలాయిస్తోందని కొంతమంది వాపోతున్నారు. మరివాళ్ళకి ఆ టెక్నాలజీ తెలిసాక మళ్ళీ వీళ్ళు చేసేది అదే.

కాబట్టి జ్ఞానానికి అందరూ అర్హులే. కానీ ఆ జ్ఞానం సాధన వల్ల రావాలి. పుస్తకాలవల్ల కాదు. ఏది



ఏమయినా ఇవ్వాళ గాయత్రీ మంత్రం అందరికీ కంఠతా వచ్చినా దాని అర్థం తెలిసిన వాడుంటం కష్టం.

ఇక్కడ ఆ మంత్రాన్ని అర్థతాత్పర్యాలే కాక తెలుగు పద్యంగా గూడా నేను చెప్పగలగటం కేవలం ఆ దేవి కృపవల్లనే.

ఇందులో ముగ్గురమ్మల మూలపుటమ్మ నేను గాయత్రి అనే భావంతో ఆ మాతకు అంకితమిచ్చాను. పార్వతీదేవిని కాశీపురాధీశ్వరి అయిన అన్నపూర్ణగాను, సరస్వతీదేవిని, మహాలక్ష్మిని ఆరాధిస్తూ అనాదిగా వస్తున్న ఈ స్తోత్రాలు జగద్విఖ్యాతమైనవి. వీటికి అర్థం వివరించగల విద్యాధికుడిని గానీ అనుభవం ఉన్నవాడిని గానీ గాకపోయినా ఉడుత శ్రీరాముడికి వారధి కట్టడానికి తన ప్రయత్నం తను జేసినట్లు నేనూ ప్రయత్నించాను. ఈ క్రింది పద్యం చూడండి. ఒకే అక్షరంతో వ్రాసిన కందపద్యం.



## ఏకాక్షర కందం

కం॥ నిను నేనననే నాన్నని
నిను నెన్నను నాన్నననను నిను నాన్ననై
నను నీనాన్నన నేనే
నిను నా నాన్ననెనె నాన్న? నేనెన్నైనా

(ఇది తండ్రీ కొడుకుల వ్యహారంగా కనిపించినా నిజానికి ఇది భక్తుడికి పరమాత్మకీ మధ్య వ్యవహారం)

తా॥ నిన్ను నేను తండ్రీ అని పిలువనే లేదు. పోనీ తండ్రిగా ఎన్ని జరిగినా పిలువలేక పోయాను. నిన్ను నా నాన్న అని పిలిపించుకోవటానికి నువ్వె నన్ను నీబిడ్డగా ‘నాన్నా’ అని ప్రేమగా పిలిస్తే మూర్ఖుడినై నేను నిన్ను నాన్నా అననైతిని. ఎన్ని అయినా గ్రహించలేక పోయాను తండ్రీ.

## ప్రార్థన

కం॥ శ్రీకరి లక్ష్మిని సిరులకు,
నాకీయగ విద్యలన్ని నలువ సతికినిన్
చేకొన జ్ఞానపు 'బువ్వ' ను
నే కొలుతును అన్నపూర్ణ నిత్యము ప్రీతిన్

కం॥ గాయత్రి మంత్ర మీవిధి
చేయగ ఆంధ్రమున నేను చేసినవేవో
ఓ యమ్మ! నీకు పూజలు
గాయత్రీ! తీర్చుకుందు కలిగిన ఋణమున్



## గాయత్రీ మహామంత్రము

మం ॥

ఓం భూర్భువస్సువః ఓం తత్సవితుర్వరేణ్యం, భర్గో దేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్.

I ఓం భూర్భువస్సువః
ఓం, భూః, భువః, సువః
పరబ్రహ్మము, శాశ్వతము(సత్తు),
అశాశ్వతము(చిత్తు),
ఆనందరూపము(అయినది)

II ధియోయోనః ప్రచోదయాత్
యః, నః, ధియః, ప్రచోదయాత్
ఏ తేజస్సు, మాయొక్క, బుద్ధులను,
ప్రేరేపించునదియో (తత్త్వజ్ఞానము
తెలిసికొనుటకు)



III. తత్స వితుర్వ రేణ్యం

తత్, సవితః, వరేణ్యం

ఆ, సృష్టి స్థితి లయకారకుడు, సర్వశ్రేష్ఠుడు

IV భర్గోదేవస్య ధీమహి

భర్గః, దేవస్య, ధీమహి

(అజ్ఞానాంధకారమును నిర్మూలించు) తేజస్సును, ప్రకాశ రూపమును, ధ్యానించు చున్నాను.



## గాయత్రీ మంత్రం పద్యం

తే॥ 'ఓం' అనే బ్రహ్మ శ్రేష్ఠమై ఒప్పుచుండె
సచ్చిదానంద రూపుడు సవితు డతడు
మా మనంబుల అజ్ఞాన మాయ ద్రోలి
ప్రేరణము జేయు తేజమున్ వేడుచుంటి

తా॥ ఏ తేజస్సు మా అజ్ఞానాంధకారమును నిర్మూలించి, మా బుద్ధులను, శాశ్వతము అశాశ్వతము మరియు ఆనందరూపియైన అపరబ్రహ్మము కొరకు ప్రేరేపించు చున్నదో దానిని నేను ధ్యానించుచున్నాను.

## శ్రీ అన్నపూర్ణా స్తోత్రమ్

శ్లో॥ 1

**నిత్యానందకరీ, వరాభయకరీ, సౌందర్యరత్నాకరీ**
**నిర్ధూతా ఖిల ఘోరపాపనికరీ, ప్రత్యక్ష మాహేశ్వరీ**
**ప్రాలేయా చల వంశపావనకరీ, కాశీపురాధీశ్వరీ**
**భిక్షాందేహి కృపావలంబనకరీ, మాతాన్నపూర్ణేశ్వరీ**

సీ॥ నిత్యమానందమ్ము నెనరుతొ గల్పించు
శ్రేష్ఠాభయపు దాత శివుని రాణి
సౌందర్య శోభకు, సాగరమీవమ్మ
సాక్షాన్మహేశ్వరి జనని వీవు
సర్వ పాపంబులన్ సమసిపోవగజేయు
మాతవు రక్షింపు మమ్ము నీవె
హిమవంతు వంశపు ఇంపు పెంచగ బుట్టి
పావనంబొనరించు పార్వతీవు



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
మాకు ఈయవేదెదనమ్మ మమ్ముబ్రోవ
కృపను ఊతగా అందించి కరుణ జూపి

తా॥ **ప్రతిదినము ఆనందమును ప్రేమతో యిచ్చెడి ఈ శివుని అర్ధాంగి శ్రేష్ఠమైన అభయ ప్రదాయిని తల్లీ! నీవు సౌందర్యపయోనిధివి, సాక్షాత్తు మహేశ్వరివి. సర్వ పాపములను నశింపజేసెడి జననివి నీవు మమ్ము రక్షింపుము. హిమవంతుని పుత్రికయైన పార్వతివి నీవే. కాశీ పట్టణాధీశ్వరివైన ఓ అన్నపూర్ణమ్మా మాకు జ్ఞానమను భిక్షను ప్రసాదించి అండవై నీవే దయతో మమ్ము కాపాడుము. నీదయను మాకు పట్టుగొమ్ముగా అందించుము.**



శ్లో॥ 2

**నానారత్న విచిత్రభూషణకరీ, హేమాంబరాడంబరీ**
**ముక్తాహార విడంబమాన విలసద్వక్షోజ కుంభాంతరీ**
**కాశ్మీరాగురు వాసితాంగరుచిరా, కాశీపురాధీశ్వరీ**
**భిక్షాందేహి కృపావలంబనకరీ, మాతాన్నపూర్ణేశ్వరీ**

సీ॥ బహు విధంబులనున్న పలు రత్నముల నొప్పు
ఆభరణంబులు అలరుచుండె
పీతాంబరమ్ములన్ పేర్మిధరించగ
ఆడంబరము పెంచె ఆమె సొగసు
ముత్యాల హారాలు ముందుబ్రేలాడంగ
వక్షోజముల్ కాంతి బడసి మెరిసె
అగరు, కుంకుమపూల అమరిన గంధాలు
దేహశోభను పెంచె దివ్యముగను



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
మాకు ఈయవేదెదనమ్మ మమ్ముబ్రోవ
కృపను ఊతగా అందించి కరుణ జూపి

తా॥ **రకరకంబులైన రత్న ఆభరణంబులతో శోభించునది, ప్రీతితో ధరించగా బంగారు వస్త్రము దేవి నీ అందమును, ఆడంబరమును పెంచుచున్నది. నీ వక్షోజములపై తాకు ముత్యాల హారముల కాంతితో మెరయు చున్నవి. అగరు, కుంకుమ పువ్వువంటి సుగంధ ద్రవ్యములు నీ శరీర సొగసును పెంచుచున్నవి. కాశీపట్టణాధీశ్వరివైన ఓ అన్నపూర్ణమ్మ మాకు జ్ఞాన భిక్షను ప్రసాదించుము. అండవై నీవే మమ్ము కాపాడుము. నీదయను మాకు పట్టుగొమ్ముగా అందించుము.**

శ్లో॥ 3

**యోగానందకరీ, రిపుక్షయకరీ, ధర్మైక నిష్ఠాకరీ**
**చంద్రార్కానల భాసమానలహరీ, త్రైలోక్యరక్షాకరీ**
**సర్వైశ్వర్యకరీ, తపఃఫలకరీ, కాశీపురాధీశ్వరీ**
**భిక్షాందేహి కృపావలంబనకరీ, మాతాన్నపూర్ణేశ్వరీ**

సీ॥ యోగ ఆనందమ్ము ఒసగి గాతువు దేవి!
శత్రునంతము జేయు జనని నీవు
ధర్మంబున, తద్దైకతనరు నిష్ఠను నిల్పి
తపఫలంబిచ్చెడి, తల్లివీవు
సూర్యచంద్రులు, అగ్ని, జొప్పించుకాంతితో
శోభింతువోయమ్మ! శుభప్రదాయి
సర్వఐశ్వర్యముల్ చక్కగా గల్పించి
త్రైలోక్య రక్షను దేవి యిచ్చు



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
మాకు ఈయవేదెదనమ్మ మమ్ముబ్రోవ
కృపను ఊతగా అందించి కరుణ జూపి

తా॥ ఓ జననీ! నీవు యోగముచే కలుగు ఆనందము గల్పించి, రక్షింతువు. శత్రు నిర్మూలనమును జేసి కాపాడెదవు. ధర్మమునందు తద్దైక నిష్ఠను నిలిపి తపఃఫలమునొసగెదవు. శుభప్రదాయిని వైన వోతల్లీ! సూర్యచంద్రులు అగ్నివలన కలుగు కాంతినిచ్చెదవు. సర్వైశ్వర్యములు కల్పించెదవు. త్రిలోకములను కాపాడు దేవివి. కాశీపట్టణాధీశ్వరివైన ఓ అన్నపూర్ణా! మాకు జ్ఞాన భిక్ష ప్రసాదించి మమ్ము రక్షించుము.



శ్లో॥ 4

**కైలాసాచల కందరాలయకరీ, గౌరీహ్యుమాశాంకరీ**
**కౌమారీ, నిగమార్థగోచరకరీ హ్యోంకార బీజాక్షరీ ।**
**మోక్షద్వార కవాటపాటనకరీ, కాశీపురాధీశ్వరీ**
**భిక్షాందేహికృపాకలంబనకరీ, మాతాన్నపూర్ణేశ్వరీ॥**

సీ॥ కైలాస పర్వత కందరంబది నీదు
నిలయంబుగా గొన్న నీవె రక్ష
గౌరి, ఉమాదేవి, కౌమారి, శాంభవీ
వేదార్థగోచరంబొదవజేయి
ఓంకారమే నీకు ఒప్పె బీజాక్షరం
బుగను ఓ శర్వాణి! ఉన్నతముగ
మోక్షద్వారము యొక్క ముందు కవాటముల్
తెరిపింతువోయమ్మ! దేవి! కృపతొ



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
మాకు ఈయవేదెదనమ్మ మమ్ముబ్రోవ
కృపను ఊతగా అందించి కరుణ జూపి

**తా॥ కైలాస పర్వతగుహలో నివసించు ఓ పార్వతీదేవీ నీవె మాకు రక్ష. ఓ గౌరీ, ఉమా, కౌమారీ శాంభవీ మాకు వేదార్థము తెలియునట్లు జేయుము. ఓ శర్వాణీ నీకు ఓంకారమే బీజాక్షరముగా ఒప్పి యున్నది. నీవు మోక్షద్వారకవాటములు తెరిపించగల దేవివి. కాశీ పట్టణాధీశ్వరివైన ఓ అన్నపూర్ణమ్మా! మాకు జ్ఞాన భిక్షను ప్రసాదించుము. అండవై నీవు మమ్ము కాపాడుము. పట్టుగొమ్మవై నీదయ అందించుము.**

**శ్లో॥ 5**

**దృశ్యాదృశ్యవిభూతి పావనకరీ, బ్రహ్మాండభాండోదరీ**
**లీలానాటక సూత్రఖేలనకరీ, విజ్ఞానదీపాంకురీ।**
**శ్రీవిశ్వేశమనః ప్రమోదనకరీ, కాశీపురాధీశ్వరీ**
**భిక్షాందేహి కృపావలంబనకరీ, మాతాన్నపూర్ణేశ్వరీ॥**

సీ॥ ప్రత్యక్ష సిరులు అప్రత్యక్షమోక్షమ్ము
పావనంబుగ నిచ్చు పార్వతీవు
బ్రహ్మాండ భాండమ్ము పరగనీఉదరాన
మాయ నాటకము ఓ మాత! జరుగు
విజ్ఞాన దీపంబు వెలిగించునది నీవె
మాతరో! తెలియునా మాయమాకు
కాశివిశ్వేశుకు కడుప్రీతి కలిగించు
అర్ధాంగివీవమ్మ అమ్మలమ్మ!



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
మాకు ఈయవేదెదనమ్మ మమ్ముబ్రోవ
కృపను ఊతగా అందించి కరుణ జూపి

**తా॥ ప్రత్యక్షముగా ఐశ్వర్యమును, పరోక్షముగా మోక్షమును అందించునట్టి పావనీ ఓ పార్వతీ! నీ ఉదరమున బ్రహ్మాండ భాండము నెలకొనియుండగా ఈ జగత్తును మాయా నాటకము ఆడించు చున్నావు. ఓ తల్లీ విజ్ఞాన దీపం వెలిగించునది నీవే. నీమాయ తెలియ సాధ్యమా. కాశీవిశ్వేశ్వరునకు ప్రియసతివి. కాశీపట్టణాధీశ్వరియైన ఓ అన్నపూర్ణమ్మా! మాకు జ్ఞాన భిక్ష ప్రసాదించుము. అండవై నీవు మమ్ము కాపాడుము. పట్టుగొమ్మవై నీదయ అందించుము.**



**శ్లో॥ 6**

**ఆదిక్షాంత సమస్తవర్ణనికరీ! శంభుప్రియే శాంకరీ**
**కాశ్మీరే త్రిపురేశ్వరీ త్రినయనీ, విశ్వేశ్వరీ శ్రీధరీ ।**
**స్వర్గద్వార కవాటపాటనకరీ, కాశీపురాధీశ్వరీ**
**భిక్షాందేహి కృపావలంబనకరీ, మాతాన్నపూర్ణేశ్వరీ॥**

సీ॥ ‘అ’ యనెడి వర్ణంబునాదిగా ‘క్ష’ తొఅంత
మయ్యెడి వర్ణంబులందుగలవు
శంభుని ప్రియసతీ శాంకరీ ఓయమ్మ!
త్రినయనీ దీనుల దిక్కునీవే
కాశ్మీరమందున గల త్రిపురేశ్వరీ!
శ్రీధరీ! నీవె విశ్వేశ్వరియును
స్వర్గద్వారంబుల పలుకవాటంబులన్
దెరిపించుతల్లివి దేవి నీవు



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
మాకు ఈయవేదెదనమ్మ మమ్ముబ్రోవ
కృపను ఊతగా అందించి కరుణ జూప్తి!

**తా॥ ఓతల్లీ! ‘అ’ నుండి ‘క్ష’ వరకు గల అన్ని అక్షరంబులలో నీవున్నావు. ఈశ్వరుని అర్ధాంగివైన నీవు శాంభవివి, త్రినయనివి, దీనులకు దిక్కువు నీవె. కాశ్మీరమునగల త్రిపురేశ్వరీ శ్రీధరీ నీవే విశ్వేశ్వరివి. స్వర్గద్వార కవాటము తెరిపించెడి దేవతవి.**

శ్లో॥ 7

ఉర్వీ సర్వజయేశ్వరీ జయకరీ, మాతా కృపాసాగరీ
నారీ నీల సమాన కుంతలధరీ, నిత్యాన్న దానేశ్వరీ
సాక్షాన్మోక్షకరీ సదాశుభకరీ, కాశీపురాధీశ్వరీ
భిక్షాందేహి కృపావలంబనకరీ, మాతాన్న పూర్ణేశ్వరీ॥

సీ॥ సర్వలోకంబుల జయమొసంగెడి తల్లి!
సర్వజయేశ్వరి! జయము నీకు
ఓదయాసంద్రమా! ఓసదాశుభకరీ!
నారీ జనాప్రియ! హరుని రాణి!
నీలివర్ణంబుతో నీకు శోభనొసంగు
కురుల నొప్పెడి తల్లి కొలుతునమ్మ
నిత్యాన్నదానమన్ నియమంపుటీశ్వరి!
సాక్షాత్తు నీవల్ల మోక్షమగును



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
మాకు ఈయవేడెదనమ్మ మమ్ముబ్రోవ
కృపను ఊతగా అందించి కరుణ జూపి

తా॥ సమస్త లోకాలకు జయమొసగెడి ఓ తల్లీ సర్వజయేశ్వరీ నీకు మంగళమగు గాక. ఓదయాసాగరమా సదా శుభమొసంగు సదా శివుని రాణీ! స్త్రీజనప్రియా! నీలి కురులు నీ సౌందర్యమును ఇనుమడింపజేయు చున్నవి. నిత్యాన్నదానవ్రత పరాయణీ సాక్షాత్తు మోక్షప్రదాయనివి. కాశీపట్టణాధీశ్వరివైన ఓ అన్నపూర్ణమ్మా మాకు జ్ఞానభిక్ష ప్రసాదించుము అండవై నీవు మమ్ము కాపాడుము. పట్టుగొమ్మవై నీదయ మాకు అందించుము.



శ్లో॥ 8

చంద్రార్కానల కోటికోటి సదృశా, బాలార్క వర్ణేశ్వరీ
చంద్రార్కాగ్ని సమాన కుండలధరీ చంద్రార్కబింబాధరీ।
మాలాపుస్తక పాశసాంకుశధరీ, కాశీపురాధీశ్వరీ
భిక్షాందేహి కృపావలంబనకరీ, మాతాన్న పూర్ణేశ్వరీ॥

సీ॥ కోటి చంద్రాగ్నులు కోటి సూర్యులతోటి
సమమైన తేజంబు జనని కుండె
చంద్ర సూర్యాగ్నుల సమకుండలములతో
బాల సూర్యుని వంటి వన్నెతల్లి
అర్క చంద్రులు బోలు అధరంబులున్ గల
దేవి ఈ ఈశ్వరి దివ్యచరిత
పొత్తంబు, జపమాలబూని పాశంబును,
అంకుశంబును దాల్చు అమ్మ ఈమె



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
మాకు ఈయవేడెదనమ్మ మమ్ముబ్రోవ
కృపను ఊతగా అందించి కరుణ జూపి

తా॥ ఆ తల్లికి కోటి సూర్య అగ్ని చంద్రుల కాంతి కలిగి యున్నది. చంద్రసూర్యఅగ్ని తేజమునకు ధీటైన కుండలములు ఈ తల్లి కర్ణాభరణములు. ఆ జనని శరీరపువన్నె బాల సూర్యునివంటిది. చంద్రసూర్య సమశోభగల అధరములు ఈ తల్లికి గలవు. ఓ అమ్మా! ఒకచేత పుస్తకము, ఒకచేత జపమాల, ఒకచేత పాశము, ఒకచేత అంకుశము ధరించి యుందువు. కాశీపట్టణాధీశ్వరివైన ఓ అన్నపూర్ణమ్మా! మాకు జ్ఞానభిక్ష ప్రసాదించుము అండవై నీవు మమ్ము కాపాడుము. పట్టుగొమ్మవై నీదయ మాకు అందించుము.

శ్లో॥ 9

దర్వీసర్వ సువర్ణరత్న రచితా, దక్షాధ్వరేసంస్థితా
వామే చారుపయోధరా మధురసా సౌభాగ్య సంపత్కరీ।
భక్తా భీష్టకరీ వరాऽభయకరీ, కాశీపురాధీశ్వరీ
భిక్షాందేహి కృపావలంబనకరీ, మాతాన్న పూర్ణేశ్వరీ॥

సీ॥ బంగారు గరిటెను బట్టి హస్తంబున
అన్నంబు బెట్టెడి అమ్మనీవు
మేలు సువర్ణ రత్నాల హారాల, వా
మాదేవి! మ్రొక్కెద పాదములను
దక్షయజ్ఞమునందు దీక్షాపరీ దేవి!
సుందర స్తనయుగ సుందరీవు
భక్తాళికోరెడి వరప్రదాయిని మాకు
అభయ ప్రదాతవౌ అమ్మ వీవు



తే॥ కాశిపురి అధీశ్వరి మమ్ముగావు మమ్మ
జనని! అన్నపూర్ణేశ్వరి! జ్ఞాన భిక్ష
నిమ్ము ఊతవై దయగొనుమీవెతల్లి
స్తోత్రమిద్దాని గొనుమమ్మపుత్రులమని.

తా॥ నీవు చేతిలో బంగారు గరిటను ధరించి, అన్నము పెట్టెడి అమ్మవి. మేలైన సువర్ణరత్న హారాలను ధరించిన ఓ వామాదేవీ! నీకు మ్రొక్కెదను. దక్షయజ్ఞమున దహింపబడిన ఓ తల్లీ సుందర స్తనయుగ సుందరివి. ఎనలేని భక్తుల కోర్కెలు దీర్చెడి అమ్మా! నీవు అభయ ప్రదాయనివి, ఓ కాశీ పట్టణాధీశ్వరీ మమ్ము కాపాడుము. ఓ తల్లీ అన్నపూర్ణా మాకు జ్ఞాన భిక్షనిమ్ము. దయగొని మాకు చేగ్రవలె సహాయమందించుము. మా అండవై యుండి కాపాడుము తల్లీ.



శ్లో॥ 10

అన్నపూర్ణే సదాపూర్ణే, శంకర ప్రాణవల్లభే।
జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం, భిక్షాందేహిచ పార్వతి॥

కం॥ సంపూర్ణంబుగనన్నము
నింపుగలోకాలకిమ్ము ఈశ్వరురాణీ!
ఇంపుగ వైరాగ్యము సి
ద్ధింపగ జ్ఞానంపు భిక్షదేవీ! గిరిజా!

తా॥ ఓ పార్వతీ దేవీ! లోకాల కన్నింటికి చక్కగ అన్నము ప్రసాదించు ఓ ఈశ్వరురాణీ! మాకు రాగబంధము నసించునట్లు అనుగ్రహించి జ్ఞాన భిక్ష నొసంగుము.



శ్లో॥ 11

మాతా చ పార్వతీదేవి, పితా దేవో మహేశ్వరః
బాంధవాః శివభక్తాశ్చ, స్వదేశో భువన త్రయమ్॥

(ఇతి శ్రీమచ్ఛాంకరాచార్యవిరచితమ్)

కం॥ జననియె పార్వతి యౌనట
జనకుండే హరుడు నిజము, జగతిని బంధుల్
గొనకొని శివభక్తాళియె
తనదేశమునైన భువనత్రయమునసైననున్

తా॥ ఈ మనదేశంలోనైనా ముల్లోకాలలో ఎక్కడైన ఆ పార్వతీదేవియే తల్లి, శంకరుడే తండ్రి శివభక్తులందరూ బంధువులే.

## సరస్వతీ ప్రార్థన

శ్లో॥ 1

**యాకుందేందుతుషారహారధవళా యా శుభ్రవస్త్రాన్వితా**
**యా వీణావరదండమండితకరా యాశ్వేతపద్మాసనా।**
**యా బ్రహ్మాచ్యుతశంకర ప్రభృతిభిర్దేవై స్సదా పూజితా**
**సామాంపాతుసరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా॥**

సీ॥ మల్లెలు, చంద్రుండు, మంచు, ముత్తెపు దండ
వలె శోభమెరిసెడి వాణియామె
ధవళ కాంతుల నొప్పి ధరియుంచు నీ తల్లి
శుభ్ర వస్త్రంబును శోభగూర్చ
ఉత్తమ వీణియ నొప్పు హస్తంబుల
తెల్లకమలమె ఆ దేవి పీట
బ్రహ్మ విష్ణువులును పరమేశ్వరుడు తాము
నుతియింతురీమెను నోరు పండ



తే॥ జడము నెలకొన, తాను, అజ్ఞానమందు
దాని పూర్తిగా తొలగించు తల్లియామె
దేవి భగవతి విద్యల దేవి ఈమె
ఓ సరస్వతి రక్షించు ఉన్నతముగ.

తా॥ **మల్లెపూలు, చంద్రుడు, మంచుకొండ, ముత్యాలదండ, వలె మెరిసి పోతున్న తెల్లటికాంతినిచ్చు శుభ్రమైన తెల్లని వస్త్రములు శోభకలిగిస్తుండగా, ఉత్తమమైన వీణియను చేతులలో ధరించి తెల్లటి పద్మమున కూర్చుని ఆ త్రిమూర్తులు తమ నోరుపండునట్లు నుతించుచుండగా, అజ్ఞాన జనితమైన జడత్వమును ఆమె సంపూర్తిగ తొలగ చేయగలదు. అట్టి భగవతీ విద్యలరాణి, ఓ సరస్వతీ నన్ను చక్కగా రక్షించుము తల్లీ!**



శ్లో॥ 2

**శారదా శారదాంభోజ వదనా వదనాంబుజే।**
**సర్వదా సర్వదాऽస్మాకం, సన్నిధి స్సన్నిధిం క్రియాత్॥**

తే॥ వాణి! శరదృతు పద్మము వంటి నీదు
పద్మ వదనపు దర్శన భాగ్యమిమ్ము
కోర్కెదీరిచి పండిత గురువులకును
ఎల్లవేళల సన్నిధి నీయుగాక.

తా॥ **ఓ సరస్వతీ! శరత్కాల పద్మమువంటి నీ ముఖము యొక్క దర్శన భాగ్యము కల్పించుము. నీవు మా కోరికలను తీర్చుదానవు. ఎల్లవేళల పండితులకు గురువులకు నీ సన్నిధి దొరుకుగాక.**



శ్లో॥ 3

**సరస్వతి! నమస్తుభ్యం, వరదే! కామరూపిణి**
**విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా॥**

తే॥ ఎల్లయెడల సరస్వతి ఈయవమ్మ
వరములను నాకు వలయు రూపమును దాల్చు
వాణి! ఓయమ్మ! పద్మ సంభవుని రాణి!
విద్య మొదలిడ సిద్ధిని వేడెదమ్మ!

తా॥ **ఓ సరస్వతీ! నాకు ఎప్పుడూ కోరిన వరములిచ్చి కరుణించుము. కావలసిన రూపమును ధరించగల ఓ వాణీ! నలువరాణీ విద్యను ఆరంభము చేయుటకు ముందు ఓ తల్లీ సిద్ధించు కృపను వేడెదను.**

శా ॥ 4

తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నీవు నా
యుల్లంబందున నిల్చి జృంభణముగా సూక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ
పుల్లాబ్జాక్షి సరస్వతీ భగవతీ పూర్ణేందుబింబాననా.

తా॥ ఈ జగత్తుకంతటికీ వెూహనరూపివైన ఓ సరస్వతీదేవీ తెల్లటి పద్మముల వంటి కన్నులుగల భగవతీ! పూర్ణచంద్ర బింబము వంటి ముఖముగల ఓతల్లీ! నిన్ను ధ్యానించి పుస్తకమును నాచేత ధరించితిని. నీవు నామనసున నిలిచి విరివిగా మంచిమాటలను, శబ్దములను శోభకలుగునట్లుగా పలుకుము. నామాట యందు ప్రీతిపూర్వకముగా నుండుము.



ఉ॥

క్షోణితలంబునన్ నుదురు సోఁకఁగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ జంచరీకచయసుందర వేణికి రక్షితామర
శ్రేణికిఁ దోయజాతభవచిత్తవశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామశుక వారిజ పుస్తకరమ్య పాణికిన్

తా॥ ఇసుక తిన్నెలవంటి పిరుదులు, తుమ్మెద రెక్కల వంటి ముంగురులు గలిగి పద్మసంభవుడైన బ్రహ్మను ఆకర్షించు కంఠస్వరము గలిగి, జపమాల, రామచిలుక, పద్మము, పుస్తకము ధరించిన సుందర హస్తములుగల ఓ వాణీ! నేలపై నెన్నుదురు తాకునట్లు వంగి నమ్రతతో నేను నీకు నమస్కరించెదను.



ఉ.

కాటుక కంటినీరు చనుఁ గట్టుపయింబడ నేల యేడ్చెదో
కైటభదైత్య మర్దనుని గాదిలి కోడల యో మదంబ యో
హాటకగర్భురాణి నిను నాకటికిన్ గొనిపోయి యల్లక
ర్ణాటకిరాత కీచకులకమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ

తా॥ కైటభాసుర సంహారి ఆ శ్రీమహావిష్ణువు యొక్క ప్రియమైన కోడలివైన నా తల్లీ! సరస్వతీ నీ కాటుక కన్నులనుండి కారిన కన్నీరు నీ కుచద్వయముపై పడునట్లు రోదించెదవెందుకు? స్వర్ణగర్భుడైన ఆ బ్రహ్మ సతీమణీ! నిన్ను నా క్షుద్బాధ తీర్చుకొనుటకు తీసుకొనిపోయి అక్కడ యున్న ఆ కర్ణాట కిరాత కీచకులకు అమ్ముకోను. త్రికరణశుద్ధిగా చెప్పు నామాట నమ్ము.



ఉ.

అంబ నవాంబుజోజ్జ్వల కరాంబుజ శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి ప్రకటస్ఫుటభూషణరత్న దీపికా
చుంబిత దిగ్విభాగ శ్రుతిసూక్తివివిక్తనిజ ప్రభావ భా
వాంబరవీధి విశ్రుతవిహారిణి నన్ గృపఁ జూడు భారతీ.

తా॥ తల్లీ! నూతన పద్మము వలె ప్రకాశించు హస్త పద్మములు గల దాన, శరచ్చంద్రుని వెన్నెల వలె ఆడంబరమైన సుందర రూపముగల దేవీ, ధరించిన నగలయొక్క రత్నదీపముల వంటి వెలుగులు ముద్దిడుచున్న దిక్కులుగల అమ్మా వేదవిదితమైన సహజ సిద్ధ ప్రభావముగల దాన, భావగగన వీధిలో యధేచ్ఛగా విహరించు సరస్వతీ మాతా! నన్ను దయజూడుము.

ఉ.

శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హార తుషార ఫేనరజతాచలకాశ ఫణీశకుందమం
దార సుధాపయోధి సితతామర సామర వాహినీ శుభా
కారత నొప్పు నిన్ను మది గానఁగ నెన్నఁడు గల్గు భారతీ॥

తా॥ ఓ సరస్వతీ దేవీ! శరత్కాల మేఘము (తెల్లగా) వలెను, చంద్రుని వలెను, కర్పూరము వలెను, పటిక వలెను, హంసవలెను, మల్లెల దండవలెను, మంచువలెను, సముద్రపు నురగవలెను, మంచుకొండ వలెను, ఆదిశేషుని వలెను, తెల్ల మందారము వలెను, పాల సముద్రము వలెను, తెల్లని పద్మము వలెను, ఆకాశ గంగవలెను, శుభకరమైన తెలుపు రంగుతో స్వచ్ఛముగా శోభించు నిన్ను నామనస్సున ఎప్పుడు చూడగల్గుదునో కదా!



## మహాలక్ష్మ్యష్టకమ్

శ్లో॥ 1

నమస్తేస్తు మహామాయే, శ్రీ పీఠే సురపూజితే।
శంఖ చక్ర గదా హస్తే, మహాలక్ష్మి నమోస్తుతే॥

తే॥ ఓ మహామాయ రూపిణీ! నమసుమములు
నీవు శ్రీపీఠ వాసివి దేవవినుత
శంఖ చక్ర గదా హస్త! జనని! జేతు
వందనం మహాలక్ష్మిశ్రీవనితకిపుడు

తా॥ ఓ మహామాయా స్వరూపిణి నీకు నమస్కారము. నీవు శ్రీపీఠ నివాసినివి. దేవతలందరిచే కొనియాడబడి పూజించబడు దానవు. ఓ శంఖ చక్ర గదాధరీ తల్లీ! మహాలక్ష్మీ నీకు వందన మొనరించెదను.



శ్లో॥ 2

నమస్తే గరుడా రూఢే, డోలాసుర భయంకరి।
సర్వ పాపహరే దేవి, మహాలక్ష్మి నమోస్తుతే॥

తే॥ దండములు గరుడారూఢ తల్లికిత్తు
భయము డోలాసురునికి నీవలన కలిగె
సర్వ పాపముల్ నీవల్ల సమసిపోవు
వందనం మహాలక్ష్మి శ్రీవనిత కిపుడు

తా॥ గరుత్మంతుని అధిరోహించు తల్లికి వందనము చేతును. నీవలన డోలాసురునికి భయము కలిగినది. నీవలన అన్ని పాపములు నశించును. తల్లీ! మహాలక్ష్మీ నీకు వందనమొనరించెదను.



శ్లో॥ 3

సర్వజ్ఞే సర్వవరదే, సర్వ దుష్ట భయంకరీ
సర్వ దుఃఖహరే దేవి, మహాలక్ష్మి నమోస్తుతే॥.

తే॥ సర్వమును దెలిసిన తల్లి సర్వ వరద
సర్వ దుష్ట భయంకరి జనని నీవె
సర్వ దుఃఖముల్ బాపెద వుర్వియందు
వందనం మహాలక్ష్మి శ్రీవనితకిపుడు

తా॥ సర్వము తెలిసిన ఓ తల్లీ నీవు అందరినీ అనుగ్రహించుదానవు. దుర్మార్గులందరికీ నీవు భయంకరివి. ఈలోకంలో దుఃఖములన్నీ తొలగించు దానవు. ఓ మహాలక్ష్మీ నీకు ఇదే నమస్కరించు చున్నాను.

శ్లో॥ 4

సిద్ధి బుద్ధి ప్రదే దేవి, భుక్తి ముక్తి ప్రదాయిని।
మంత్రమూర్తే సదాదేవి, మహాలక్ష్మి నమోస్తుతే

తే॥ సిద్ధి బుద్ధుల జేకొన జేయు దేవి
భుక్తి ముక్తులనీ లక్ష్మిబూని యిచ్చు
మంత్రముల అధీష్ఠానమీ మాత నిజము
వందనం మహాలక్ష్మి శ్రీవనితకిపుడు

తా॥ సిద్ధిబుద్ధులను కలుగజేయు దేవి తిండి మోక్షములన ఈ లక్ష్మి పూనుకుని అందించును. ఈ తల్లి మంత్రములకు అధిష్ఠానదేవత ఓ మహాలక్ష్మి నీకు ఇపుడు నమస్కరించు చున్నాను.



శ్లో॥ 5

ఆద్యన్తరహితే దేవి, ఆదిశక్తి మహేశ్వరి
యోగజ్ఞే యోగసంభూతే, మహాలక్ష్మి నమోస్తుతే

తే॥ ఆది అంతముల్ లేనిదా ఆదిశక్తి
యోగ మెరిగిన దాయమ్మ యోగలభ్య
ఈమె విష్ణుప్రియయును మహేశ్వరీమె
వందనం మహాలక్ష్మిశ్రీవనితకిపుడు

తా॥ ఆ ఆదిశక్తికి ఆదియు అంత్యములు లేవు. యోగముచే లభించు ఆ దేవి యోగ విద్య నెరిగిన తల్లి. ఈమె శ్రీమహావిష్ణువుకు ప్రియురాలు మహేశ్వరి. ఆ మహాలక్ష్మికి ఇదే నమస్కరించు చున్నాను.



శ్లో॥ 6

స్థూల సూక్ష్మ, మహారౌద్రే, మహాశక్తే మహోదరే।
మహాపాపహరే దేవి, మహాలక్ష్మి నమోస్తుతే॥

తే॥ స్థూలమైనది భీకరి సూక్ష్మముయును
పెద్ద యుదరము పెనుశక్తి వెలయుచుండె
పాపములద్రుంచ జననియు పావనియును
వందనం మహాలక్ష్మిశ్రీవనిత కిపుడు

తా॥ స్థూలమైనదియు సూక్ష్మమైనదియు పెద్ద ఉదరము గలదియు, మహాశక్తియు అయిన సర్వపాప సంహారిణి పరమపావని, ఓ మహాలక్ష్మి నీకు వందనము సమర్పిస్తున్నాను.

శ్లో॥ 7

పద్మాసనస్థితే దేవి, పరబ్రహ్మ స్వరూపిణి
పరమేశ్వరి జగన్మాతః మహాలక్ష్మి నమోస్తుతే



తే॥ పద్మమే ఆసనంబైన పద్మజనిత
వెలసె పరబ్రహ్మ రూపిణై తలచిచూడ
సర్వజగతికి మూలమౌ జనని ఈమె
వందనం మహాలక్ష్మి శ్రీవనితకిపుడు

తా॥ పద్మము ఆసనమైన ఈ దేవి పద్మమునుంచి పుట్టినది. ఈమె పరబ్రహ్మరూపిణై వెలసి యున్నది. సర్వజగత్తుకి ఈమె తల్లి. అట్టి ఓ మహాలక్ష్మి నీకు ఇదే నా నమస్కారము.

శ్లో॥ 8

శ్వేతాంబరధరే దేవి, నానాలంకార భూషితే।
జగత్ స్థితే జగన్మాతః మహాలక్ష్మి నమోస్తుతే॥

తే॥ రమ్యమౌ పెక్కు నగలు అలంకరించి
శ్వేత వస్త్రధారిణియైన శ్రీలతాంగి
జగము నిలిపిన ఈ తల్లి జగతి జనని
వందనం మహాలక్ష్మి శ్రీవనితకిపుడు

తా॥ పలు సుందరాభరణాలచే అలంకరించబడిన ఈమె తెల్లని .వస్త్రమును ధరించిన తరుణి. జగత్తునంతటిని ఉద్ధరించు ఈ తల్లి జగజ్జనని. ఓ మహాలక్ష్మి నీకు నమస్కరించెదను.

శ్లో॥ 9

మహాలక్ష్మ్యష్టకం స్తోత్రం, యఃపఠేద్భక్తి మాన్నరః ।
సర్వసిద్ధి మవాప్నోతి, రాజ్యం ప్రాప్నోతి సర్వదా॥



తే॥ తాము ఈ మహాలక్ష్మ్యష్టకమును ప్రీతి
భక్తి శ్రద్ధతో చదువరే ప్రార్థనందు
సర్వసిద్ధులు కలుగును జయము కల్గు
రాజ్యభోగములీ మహాలక్ష్మి యిచ్చు

తా॥ ఈ మహాలక్ష్మి అష్ఠకమును ప్రేమగా భక్తిగా శ్రద్ధగా తమరు ప్రార్థనలొ పఠించినచో సర్వ సిద్ధులూ కలుగును. విజయములు కలుగును. ఈ మహాలక్ష్మి రాజ్యభోగముకూడా కలుగ జేయును.

శ్లో॥ 10

ఏకకాలే పఠేన్నిత్యం, మహాపాప వినాశనమ్॥
ద్వికాలేయః పఠేన్నిత్యం, ధనధాన్య సమన్వితః॥
త్రికాలంయః పఠేన్నిత్యం, మహాశత్రు వినాశనమ్
మహాలక్ష్మీర్భవేన్నిత్యం, ప్రసన్నా వరదా శుభా॥



(ఇన్ద్రకృత శ్రీమహాలక్ష్మ్యష్ఠక స్తోత్రం సంపూర్ణమ్)

తే॥ పఠనమొకసారి నిత్యము పాపముక్తి
రెండుసార్లైన ధనధాన్య 'మెండు' కలుగ
మూడు మారుల శత్రుల ముప్పు దొలగు
శ్రీమహాలక్ష్మి సర్వదా చేయు శుభము

తా॥ ఈ అష్ఠకము ఒకసారి పఠించిన ప్రతిదినమూ పాప విముక్తి కలుగును. రెండు పర్యాయములైనచొ సమృద్ధిగా ధనధాన్య లాభము, మూడు మారులకు శత్రుభయనాశనము చేసి శ్రీమహాలక్ష్మి సర్వదా శుభములిచ్చుగాక.

(ఇది ఇంద్రుడు చెప్పిన శ్రీమహాలక్ష్మి అష్ఠకము)





## అంకితం

కం॥ గొనుమిది ఓ గాయత్రీ!
మునునే "ముగురమ్మలకును మూలపుటమ్మన్
అనువుగ పొగడుచు జెప్పితి
ఘనముగ అంకితము నొంది గావవె తల్లీ!